





మట్టి లొట్టికి కరువొచ్చింది

భూంపల్లి గ్రామశివారులో ఈతచెట్లకు మట్టి కుండలకు బదులుగా ప్లాస్టిక్ బిందెలు కట్టి కల్లు పడుతున్నారు. మట్టి కుండలు అయితే ఈ ఎండలకు బల్లులు, పాములు, తొండలు చల్లదనం కోసం కుండల్లోకి వెళ్తాయని, అదే ప్లాస్టిక్ బిందెలయితే వెల్లవని గౌడన్నలు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మట్టి కొండలు కూడా దొరకడం లేదని అందుకనే ప్రత్యామ్నాయంగా ఈ మార్గాన్ని ఎంచుకున్నామని తెలిపారు.

- సిద్ధిపేట జిల్లా ఫొటోగ్రాఫర్ , ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)

కమల దళంలో కలకలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై అసంతృప్తి
- పార్టీ నిర్ణయంపై బాహాటంగా విమర్శలు
- సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపణలు
- ఓ ఎంపీ పాత్రపై సొంత శిబిరంలోనే అసహనం
- నిరుత్సాహంలో నేతలు
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కార్యకర్తల్లో నిస్తేజం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 20: సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడి నియామకం ఆ పార్టీలో ముసలాన్ని పుట్టించింది. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన బైరి శంకర్ ముదిరాజ్‌కు తాజాగా జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించడంతో లుకలుకలు మొదలయ్యాయి. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న సీనియర్లు, అధ్యక్ష పదవి దక్కుతుందని ఆశపడినవాళ్లు అసంతృప్తికి గురయ్యారు. రాష్ట్ర పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. సిద్ధాంతాలకు ప్రతికూలంగా అధ్యక్షుడి ఎంపిక జరిగిందని సోషల్ మీడియాలో బాహటంగానే విమర్శలు గుప్పిస్తున్నా రు. పార్టీకి చెందిన ఓ ఎంపీ కారణంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని అసహనం వ్యక్తపరుస్తున్నారు.

సిద్దిపేట జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత ఎనిమిదేళ్ల వ్యవధిలో నాయిని నరోత్తంరెడ్డి, దూది శ్రీకాంత్‌రెడ్డి, గంగాడి మోహన్‌రెడ్డి బీజేపీ అధ్యక్షులుగా పనిచేశారు. తొలిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన బైరి శంకర్ ముదిరాజ్‌కు అవకాశం కల్పించారు. అయితే బీసీ కోటాలో గత మూడు దఫాలుగా అధ్యక్ష పదవిని ఆశించిన అంబటి బాలేశ్‌గౌడ్‌కు పదవి దక్కలేదు. ఈసారి ఎలాగైనా పదవి వస్తుందని అనుకున్నప్పటికీ ఓ ఎంపీ కారణంగా బాలేశ్‌గౌడ్‌కు మళ్లీ నిరాశ తప్పలేదన్నట్లుగా చర్చ జరగుతోంది. మరోసారి అవకాశం దక్కుతుందని భావించిన మోహన్‌రెడ్డికి కూడా అసంతృప్తి మిగిలింది.

అనూహ్యంగా తెరమీదకు..

జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తున్న తరుణంలో సిద్దిపేట జిల్లా బీజేపీ రథసారథి ఎవరనే విషయంపై ఆసక్తి నెలకొన్నది. తమకే అవకాశం కల్పించాలని పార్టీకి చెందిన పలువురు సీనియర్లు రాష్ట్రస్థాయిలో విన్నవించుకున్నారు. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన ముగ్గురికీ ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, బీజేవైఎం విభాగాలలో ఏదో ఒక నేపథ్యం ఉంది. ఈసారి కూడా పార్టీ సిద్ధాంత నియమావళి ప్రకారమే అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని అంతా భావించారు. జిల్లా అధ్యక్షుడిగా పోటీపడాలంటే పార్టీలో రెండు సార్లు క్రియాశీల సభ్యత్వం ఉండాలనే నిబంధన ఉండడంతో అంబటి బాలేశ్‌గౌడ్ పేరు తుది పరిశీలనలో చేర్చారు. ఏడాది క్రితమే అధ్యక్ష పదవి పొందిన గంగాడి మోహన్‌రెడ్డి పేరును సైతం పరిగణనలోకి తీసుకున్నారు. వీరిద్దరి స్థానంలో అనూహ్యంగా బైరి శంకర్ పేరు తెరమీదకు రావడంతో అంతా అవాక్కయ్యారు. తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీల్లో పనిచేసి మూడేళ్ల క్రితమే బీజేపీలో చేరిన శంకర్ పేరును ఖరారు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీకి చెందిన ఓ ఎంపీ కారణంగానే బాలేశ్‌గౌడ్‌కు పదవి దక్కలేదని.. అధ్యక్ష పదవి అనూహ్యంగా శంకర్‌ను వరించిందని కాషాయ దళంలో అసహనానికి గురవుతున్నారు. ఆ ఎంపీ తన భవిష్యత్తును ఆలోచించి తనదైన పాత్ర పోషించడం వల్లనే ఈ నియామకం జరిగిందని ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వేళ అసంతృప్తి..

బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై సోషల్ మీడియా వేదికగా ఆ పార్టీ శ్రేణులు తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. నిన్నమొన్నటిదాకా తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేసిన సోషల్‌మీడియా సాక్షిగా బీజేపీ పెద్దల వైఖరిని ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడినవారిని కాకుండా ఇతరులకు పదవులను ఎలా కట్టబెడతారని విమర్శిస్తున్నారు.

మిగతా 8వ పేజీలో...



హుండీల్లో లభ్యమైన విదేశీ కరెన్సీ

19 రోజులు రూ.78లక్షలు

- మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు

చేర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కానుకలు, ఒడిబియ్యం, హుండీ లెక్కింపులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో శ్రీ లలితా సేవా ట్రస్ట్ సభ్యులు కరెన్సీ లెక్కించారు. రూ.78,31,047నగదు, 82 గ్రాముల బంగారం, 5.100 కిలోల వెండి, 13 క్వింటాళ్ల ఒడిబియ్యం, 130విదేశీ కరెన్సీ నోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల ఐదోవారం జాతర పూర్తవగా, వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తద్వారా ఆలయంలో ఆయా హుండీలు నిండుతుండడంతో ఆలయాధికారులు లెక్కింపులు నిర్వహించారు. గత నెల 31న హుండీలు లెక్కించగా ఈ ఆదాయం కేవలం 19 రోజుల్లోనే సమకూరింది. కార్యక్రమంలో సిద్దిపేట శరబేశ్వర స్వామి దేవాలయ ఈవో రవి కుమార్, ధర్మకర్తలు కొప్పురపు జయప్రకాశ్ రెడ్డి, మామిడాల లక్ష్మి, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

- మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 43 కేంద్రాలు
- హాల్ టికెట్, ప్రశ్నాపత్రంపై బార్‌కోడ్
- ఒత్తిడికి లోనైతే టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబర్
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



సిద్దిపేటకల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 5 నుంచి 24 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, పరీక్షల కమిటీ జిల్లా కన్వీనర్ రవీందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి..?

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే ఫైనల్ ఎగ్జామ్స్ కోసం జిల్లావ్యాప్తంగా 43 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో 20 ప్రభుత్వ కళాశాలలు, 9 గవర్నమెంట్ సెక్టార్ కాలేజీలు, 14 ప్రైవేట్ కాలేజీల్లో సెంటర్లను ఏర్పాటు చేశాం. మొదటి సంవత్సరంలో 9770 మంది, సెకండ్ ఇయర్ 10815 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నారు. పరీక్షల నిర్వాహణకు డీఈసీ (డిస్ట్రిక్ ఎగ్జామ్స్ కమిటీ) ఉంటుంది. ఈ కమిటీకి కన్వీనర్‌గా డీఐఈవో వ్యవహరించగా, చేర్యాల కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జ్యోతి, హుస్నాబాద్ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్. గంగాధర్, సిద్దిపేట బాలుర కళాశాల జూనియర్ లెక్చరర్ దేవయ్య సభ్యులుగా ఉంటారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టిస్ జరగకుండా 2 ప్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్, 3 సిట్టింగ్ స్క్వాడ్ టీమ్స్ ఏర్పాటు చేశాం.

హాల్‌టికెట్స్, ప్రశ్నాపత్రాలపై వచ్చే బార్‌కోడ్స్ వల్ల ప్రయోజనాలేంటి..? ప్రత్యేకత ఏదైనా ఉందా ?

విద్యార్థుల పరీక్షలకు ముందు హల్ టికెట్స్‌ను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. వివరాలు సరిగ్గా ఉన్నా యా లేదా సరిచూసుకోవాలి. హల్ టికెట్ మీద బార్ కోడ్ ముద్రణతో వస్తుంది. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేసినట్లయితే సెంటర్ అడ్రస్, గూగుల్ మ్యాప్ చూపిస్తుంది. దీనివల్ల విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సెంటర్లకు చేరుకోవచ్చు. ఇక ప్రశ్నాపత్రం పేపర్ మీద ముద్రణ చేసిన బార్ కోడ్ వల్ల పేపర్ లీకేజీ వంటి సమస్యలను అధిగమించవచ్చు. ఒకవేళ లీకైనా ఏ సెంటర్ నుంచి బయటకు వచ్చిందనేది తెలుసుకోవచ్చు.

వివిధ శాఖల అధికారులతో ఎలా సమన్వయం చేస్తారు

గతంలో ఒకసారి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. నేడు మరోసారి సమావేశం ఉంటుంది. ఆ సమావేశంలో వివిధ శాఖలకు కలెక్టర్ దిశానిర్దేశం చేయనున్నారు.

విద్యార్థులకు పరీక్షలంటే భయం, మానసిక ఒత్తిడికి గురవుతుంటారు.. వారికి మీరిచ్చే సలహా..?

మానసిక సమస్యలు, ఒత్తిడిని దూరం చేయడానికి ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. అవసరం అయితే ప్రత్యేకంగా టెలిమానస్ ద్వారా 14416 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చు. ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే మానసిక వైద్యులు అందుబాటులో ఉంటారు. వారికి విద్యార్థుల సమస్య చెబితే పరిష్కారం లభిస్తుంది. విద్యార్థులే కాకుండా తల్లిదండ్రులు కూడా ఈ నెంబర్‌కు ఎనీ టైమ్ కాల్ చేయవచ్చు. విద్యార్థులు ఆందోళన చెందకుండా బాగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణతతో జిల్లాను బెస్ట్ పొజిషన్‌లో నిలపాలి.



టమాట.. నష్టాల బాట

టమాట పంట చేతికొచ్చే దశలో మార్కెట్‌లో ధరలు లేక రైతులు దిగాలు చెందుతున్నారు. నంగునూరు మండలం అప్పలాయ చెరువు గ్రామానికి చెందిన రైతు నాయిని రాంరెడ్డి తనకున్న మామిడి తోట మధ్యలో అంతర పంటగా ఎకరంలో టమాట సాగు చేశాడు. సాగుకు దాదాపు రూ.30వేల వరకు ఖర్చు చేశాడు. కనీసం రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పంటను చేనులోనే వదిలేశారు.

- నంగునూరు, ఫిబ్రవరి 20

భళా బాలక

కిలిమంజారో, పాతాల్సు పర్వతాలను అధిరోహించిన హనుమతండావాసి

బాలుడికి వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చి అభినందించిన గవర్నర్



7

నిబంధనలు పాటించకుంటే ఆసుపత్రులు సీజ్

- డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్ ఆదేశాల మేరకు వివరాలు సేకరణ
- సిద్దిపేటలో పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సిద్దిపేటలోని ఓ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించకపోతే సీజ్ చేయడంతో పాటు జరిమానాలు, వైద్యుడిగా అనర్హత వేటు వేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్ హెచ్చరించారు. ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "లబ్...డబ్బు" కథనానికి వైద్యశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రోగామ్ అధికారి డాక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యశాఖ ఆకస్మిక తనిఖీలు చేపట్టి, వివరాలను సేకరించారు. పలు ఆసుపత్రుల్లో వైద్యసేవలకు సంబంధించిన పట్టిక ప్రదర్శించలేదని, మరో ఆసుపత్రిలో అనవసర సీజరియన్ నిర్వహించినట్లు తేలడంతో ఆయా ఆసుపత్రులను నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలని, అవసరం లేకున్నా పరీక్షలు నిర్వహించరాదని సూచించారు. ప్రతి ఆసుపత్రుల్లో సేవలకు సంబంధించిన ధరల సూచిక బోర్డులను తప్పకుండా ప్రదర్శించాలన్నారు. అనవసర పరీక్షలు, ఫేక్ రిపోర్టులు ద్వారా చికిత్సలు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. అధిక ఫీజులు, గర్భిణులకు హైరిస్క్ లక్షణాలు లేకున్నా సిజేరియల్ ఆపరేషన్లు చేయడం తగదన్నారు. ఎవరైనా చట్టాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపైన చట్ట ప్రకారం చర్యలు చేపడతామన్నారు. ఆసుపత్రుల యాజమాన్యాలు కొత్తగా రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

చట్టాలపై అవగాహన అవసరం

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి స్వాతిరెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కొండపాక లోని ఆనంద నిలయం వృద్ధాశ్రమాన్ని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి స్వాతి రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆనంద నిలయంలోని వృద్ధులకు, బాలసదనంలోని బాలలకు చట్టాలు హక్కులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి చట్టరీత్యా వారికి అందుతున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కృష్ణమోహన్ ,ఆనంద నిలయం ప్రతినిధులు పెద్ది వైకుంఠం, బెజగామ వెంకటేశం లోకదాలత్ సిబ్బంది వృద్ధాశ్రమంలోని వృద్ధులు బాల సదనంలోని బాలురు పాల్గొన్నారు.

బాలికల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- గట్లమల్యాల బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ మనుచౌదరి
- బాత్‌రూం తలుపులు సరిగా లేకపోవడంపై అధికారిపై ఆగ్రహం



నంగునూరు మండలం గట్ల మల్యాల బాలికల హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

నంగునూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాలికల వసతి గృహాల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ మనుచౌదరి అధికారుల ఆదేశించారు. గురువారం నంగునూరు మండలం గట్లమల్యాలలోని షెడ్యూల్ కులాల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో బాలికల డార్మెటరీ, వంటగది స్టోర్ రూంలను పరిశీలించారు. వంట సరుకుల సరఫరా ఎలా ఉందని ఏదైనా ఇబ్బంది ఉంటే తెలియజేయాలన్నారు. మెనూ ప్రకారం అల్పాహారం వండేందుకు వంట పాత్రల కొరత ఉంటే జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్సీ హాస్టళ్లలో పరిశీలించి వాటి కొనుగోలు కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఇన్‌చార్జి ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి హమీద్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనంతో పాటు స్నాక్స్ కచ్చితంగా అందించాలని సూచించారు. బాత్‌రూంలకు సరిగా డోర్స్ లేకపోవడంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మాధవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల హాస్టళ్లలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే కొత్త డోర్లను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనుల్లో వేగం పెంచాలి

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనుల్లో వేగం పెంచి వచ్చే జూన్‌నాటికి రైతులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గురువారం నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మాణంలో గల ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కలెక్టర్ సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో సంబంధిత అధికారులతో చర్చించారు. అలాగే పవర్ ప్లాంట్ పనులను జూన్ మొదటి వారం లోపు పని పూర్తి చేయాలని ఆదేశించారు. సివిల్, మెకానికల్ పనులు త్వరగా కంప్లీట్ చేసి ఫ్యాక్టరిని జూన్ మొదటి వారం లోగా రైతు లకు అందుబాటులో తేవాలని ఆయిల్ ఫేడ్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, నిర్మాణ సంస్థ సైట్ మేనేజర్లను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి సువర్ణ, ఉద్యాన శాఖ అధికారులు, నంగునూరు తహసీల్దార్ సరిత, ఎంపిడివో లక్ష్మప్ప తదితరులు ఉన్నారు.



జగదేవ్‌పూర్ మండలం బీజీ వెంకటాపూర్‌లో నిరుపయోగంగా ఫంక్షన్‌హాల్

రూ.లక్షలు ఖర్చు చేశారు.. వదిలేశారు

- బీజీ వెంకటాపూర్‌లో రూ.75లక్షలతో నిర్మించిన ఫంక్షన్‌హాల్
- గత ప్రభుత్వంలో ప్రారంభించినప్పటికీ రెండేళ్లుగా వినియోగానికి దూరం
- శుభకార్యాల కోసం ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను ఆశ్రయిస్తున్న ప్రజలు

8

108 అంబులెన్స్‌లో ప్రసవం

● తల్లీబిడ్డ క్షేమం.. సంగారెడ్డి ఆస్పత్రికి తరలింపు

వట్‌పల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవమై శిశువుకు జన్మనిచ్చిన సంఘటన గురువారం వట్‌పల్లి మండలంలో చోటుచేసుకున్నది 108 అంబులెన్స్ ఈఎంటీ దేవేందర్, పైలట్ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొర్రేకల్ గ్రామానికి చెందిన ఉసిరిక పల్లి అనితకు నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. నొప్పులు ఎక్కువ కాగా, అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. అనిత మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు, వారిని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించామని ఈఎంటీ తెలిపారు.



బిడ్డను చూపిస్తున్న ఈఎంటీ దేవేందర్

ప్రమాదవశాత్తు నీలగిరి తోట దగ్ధం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి నీలగిరి తోట (నీలగిరి చెట్లు) దగ్ధమైన సంఘటన చిన్నకోడూరు మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనెపల్లికి చెందిన కూర రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డికి గ్రామ శివారులో 15 ఎకరాల నీలగిరి తోట ఉంది. బుధవారం అర్ధరాత్రి తోటలో ఒక వైపు మంటలు చెలరేగగా, తోట మొత్తం వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.



గోనెపల్లి శివారులో నీలగిరి తోటల్లో మంటలు

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● పోలీసుల అదుపులో ఆరుగురు

● రూ.4.50 కోట్ల విలువైన పల్లాడియం కార్బన్ స్వాధీనం

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల్లో పల్లాడియం కార్బన్ దొంగతనానికి పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.4.50 కోట్ల విలువైన పల్లాడియం కార్బన్ స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న తేదీన సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధి యావాపూర్‌లో అరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్-3 కంపెనీలో పల్లాడియం కార్బన్ చోరీ కాగా, ఆ కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ మజ్జి సూరప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదాశివపేట, సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలో ఆరుగురు నిందితులను పట్టుకుని వారి నుంచి 96 కిలోల పల్లాడియం కార్బన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

ముఠాగా ఏర్పడి దొంగతనాలు

నంద్యాల జిల్లా మహానంది మండలం మసీద్‌పురం గ్రామానికి చెందిన అల్లం సాంబశివుడు(43) ప్రస్తుతం హైదరాబాద్‌లోని సూరారంలో నివాసముంటున్నాడు. ఆయనతోపాటు మహారాష్ట్రలోని పూణే జిల్లా దేవల్గవడకు చెందిన ప్రసాద్ సాహెబ్ షిటోలే(24), మహారాష్ట్రలోని పటాస్‌కు చెందిన ఆదిత్య అంకుష్ మన్నె(23), సదాశివపేట మండలం యావాపూర్‌లోని ఆరేన్ లైఫ్ సైన్సెస్ యూనిట్-3 స్టోర్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న తమ్మ ముక్కంటిరెడ్డి(47), హైదరాబాద్ చింతల్‌లోని వాణినగర్‌కు చెందిన మట్టా కుటుంబరావు(46), గాజులరామారానికు చెందిన కెమికల్ వ్యాపారి గుమ్మడి శ్రీనివాస్‌రావు(47) ముఠాగా ఏర్పడ్డారు. అల్లం సాంబశివుడు గతంలో పూణేలో ఫార్మా కంపెనీలో పనిచేసే సమయంలో ప్రసాద్, అమోల్ జాగడే(రాజు)తో పరిచయం ఏర్పడింది. పూణేలో పని మానేసిన సాంబశివుడు హైదరాబాద్‌కు వచ్చి పల్లాడియం కార్బన్ లభించే ఫార్మా కంపెనీల గురించి ఆరా తీశాడు. కంపెనీల్లో పనిచేసే స్టోర్ సిబ్బందికి డబ్బు ఆశ చూపి సమాచారం సేకరించేవాడు. సాంబశివుడు ఈ విషయాన్ని ప్రసాద్‌కు, అమోల్ జాగడే టీంకు తెలియజేసేవాడు. 2023లో సాంబశివుడు అమోల్ జాగడే అతని గ్యాంగ్ సభ్యులు గుమ్మడిదల పోలీస్‌స్టేషన్, బొంతపల్లిలో గల న్యూలాండ్ కంపెనీలో 35 కిలోల పల్లాడియం కార్బన్ దొంగతనం చేశారు. 2024 నవంబరులో అమోల్ జాగడే గ్యాంగ్ బొల్లారంలోని రాంప్యాక్స్ కంపెనీలో 8 కిలోలు, 2024 డిసెంబరులో ప్రసాద్, అతని గ్యాంగ్ సభ్యులు బీదర్‌లోని సాయిలైఫ్ సైన్సెస్‌లో 17 కిలోల వరకు పల్లాడియం కార్బన్ దొంగతనం చేశారు. 20 రోజుల క్రితం సాంబశివుడు సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని యావాపూర్‌లో అరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్ 3 గురించి తెలుసుకొని, స్టోర్ మేనేజర్ ముక్కంటిరెడ్డికి డబ్బు ఆశ చూపి మెటీరియల్ పూర్తి వివరాలు తెలుసుకుని ప్రసాద్‌కు తెలియజేశాడు. ఈ నెల 8వ తేదీన ప్రసాద్ అతని గ్యాంగ్ సభ్యులు కంపెనీలో 120 కిలోల పల్లాడియం కార్బన్ దొంగిలించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రూపేష్ వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐలు మహేష్‌గౌడ్, శివకుమార్, రామునాయుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న పల్లాడియం కార్బన్‌ను చూపుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్, సీసీఎస్ పోలీసులు

రాజీ కుదిర్చేలా అవగాహన కల్పించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరు వర్గాలను రాజీపడేలా అవగాహన కల్పించాలని, మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి గురువారం ఆయన పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాజీకి అవకాశం ఉన్న కేసులన్నీ పరిష్కరించాలన్నారు. అలాగే సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడానికి సంబంధిత బ్యాంకు అధికారులకు కోర్టు ద్వారా ఉత్తర్వులు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించేది లేదు : ఎస్పీ

మునిపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాలిక మృతిపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఎంత వారినైనా ఉపేక్షించేది లేదని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. ఈనెల 11న మునిపల్లి మండలం అంతారం గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘటనలో గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కుమార్తె(15) గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో 16న మృతి చెందింది. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో కలిసి అంతారం గ్రామాన్ని ఎస్పీ రూపేష్ గురువారం సందర్శించారు. ఇస్మాయిల్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతికి కారుకులైన వీరారెడ్డి, విజయ్‌రెడ్డిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులకు ఎలాంటి వ్యక్తిగత కక్షలేదని, ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించాలన్నారు. చదువుకునే విద్యార్థి మృతి చెందడం కుటుంబంలో తీరని లోటు అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనతో మాట్లాడొచ్చని ఇస్మాయిల్ కుటుంబానికి సూచించారు. ఎస్పీ వెంట కొండాపూర్ సీఐ వెంకట్, మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక ఫిల్టర్‌పై పోలీసుల దాడులు

● 2 ట్రాక్టర్లు, హిటాచీ, మూడు బైకులు స్వాధీనం

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నక్కవాగు వద్ద ఇసుక ఫిల్లర్‌పై పోలీసులు దాడులు చేశారు. వివరాల్లోకి వెళితే.. నక్కవాగు పరిసర ప్రాంతాల్లో బ్యాతోల్ తండా వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్టు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో రెండు ట్రాక్టర్లు, ఒక హిటాచీ, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

గుప్తనిధులు తవ్వుతున్న ముగ్గురి పట్టివేత

మనోహరాబాద్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుప్త నిధుల కోసం తవ్వుతుండగా గ్రామస్థులు పట్టుకున్న ఘటన మండల పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలో త్రిపురం వెంచర్‌లో హైదారాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వుతున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే అక్కడికి చేరుకుని ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



పిట్ల కృష్ణ (ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ(40)కు భార్య లలిత, కూతురు, కుమార్తె ఉన్నారు. కృష్ణ తనకున్న పొలంతో పాటు గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం పొలం వద్ద బోరుమోటారు నడవకపోవడంతో రిపేరు చేయాలనుకున్నాడు. దీని కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు, కుటుంబసభ్యులు కృష్ణను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కృష్ణ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. గ్రామంలో విషాదం అలుముకున్నది.

సీలింగ్ ఫ్యాన్ మరమ్మతు చేస్తుండగా మరొకరు..



పొట్టినోళ్ల నర్సింహులు(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ మరమ్మతు చేసే క్రమంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన సంఘటన రామాయంపేట మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని లక్ష్మాపూర్‌లో గ్రామానికి చెందిన పొట్టినోళ్ల నర్సింహులు(55) ఇంట్లో ఫ్యాన్ తిరగకపోవడంతో తనే మరమ్మతు చేస్తున్నాడు. కరెంటు సరఫరా ఉండగానే ఫ్యాన్ బిగిస్తున్న సమయంలో వైర్లు చేతికి తగిలి ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన భార్య లక్ష్మి చుట్టుపక్కల వారి సహాయంతో నర్సింహులును రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నర్సింహులు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

సంగారెడ్డి జీజీహెచ్ ఎదుట గుర్తుతెలియని ఇద్దరి మహిళల మృతి

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) ఎదుట గుర్తుతెలియని ఇద్దరు మహిళలు మృతిచెందినట్టు సీఐ ఎస్.రమేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇద్దరు మహిళలు కొన్నాళ్లుగా సంగారెడ్డి జీజీహెచ్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవించే వారు. రాత్రి సమయంలో ఆస్పత్రి ఎదుట ఉన్న జనరిక్ మెడికల్ స్టోర్ ముందు పడుకునే వారు. అయితే, గురువారం మధ్యాహ్నం సమయంలో జీజీహెచ్ క్యాజువాలిటీ ఎదుట వీరిద్దరూ చనిపోయి కనిపించారు. ఆస్పత్రి సెక్యూరిటీ గార్డ్ ఇన్‌చార్జి జాన్, సెక్యూరిటీ వార్డు బాయ్ కల్పగూరి ఆంజనేయులు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రమేష్ పేర్కొన్నారు. అనారోగ్య కారణంతో మరణించి ఉండవచ్చని సీఐ తెలిపారు.

భర్త హత్య కేసులో భార్య, అల్లుడి రిమాండ్

● బీమా డబ్బు కోసం ఘాతుకం



నిందితులను చూపుతున్న పోలీసులు

పాపన్నపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భర్తకు సేవ చేయలేక అల్లుడి సహాయంతో హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఇద్దరి నిందితులను రిమాండుకు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. పాపన్నపేట మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన కర్రెల్ల ఆశయ్య ఈ నెల 15న వ్యవసాయ క్షేత్రంలో కాలు జారి పడడంతో నడుం తుంటి వద్ద విరిగింది. వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బు వెచ్చించాల్సి వస్తుందని అంతమొందిస్తే సమస్య తీరడంతో పాటు బీమా డబ్బు వస్తుందని ఆశతో ఈనెల 17న రాత్రి ఆశయ్య నిద్రిస్తున్న సమయంలో భార్య శివమ్మ, అల్లుడు రమేష్ సహాయంతో గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. అనంతరం సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారు. గ్రామస్థులు మృతుడి గొంతుపై ఘాట్లు చూసి మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. ఆశయ్య సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేయగా అల్లుడు రమేష్ సహాయంతో భార్య శివమ్మ హత్య చేసినట్లు తేలింది. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని 12 గొర్రెలు మృతి

● గొర్రెల కాపరికి స్వల్ప గాయాలు

కొల్చారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని కారు ఢీకొని.. 12 గొర్రెలు మృతిచెందగా, గొర్రెల కాపరికి స్వల్ప గాయాలైన సంఘటన కొల్చారం మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం మెదక్ పట్టణానికి చెందిన వెంకయ్య, శ్రీశైలం ఇద్దరు కలిసి చిన్నగనాపూర్ నుంచి రాత్రిపూట మెదక్‌కు గొర్రెలను కొట్టుకొని వస్తున్నారు. కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు హనుమాన్ బండలు వద్ద గుర్తుతెలియని కారు ఢీకొనడంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల కాపరి వెంకయ్యకు స్వల్ప గాయలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కోనాపూర్ సొసైటీలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ

రామాయంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ సొసైటీలో నిధుల గోల్‌మాల్‌పై గురువారం అధికారులు విచారణను ప్రారంభించారు. కోనాపూర్ సొసైటీ గత చైర్మన్ అయిన మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి భర్త దేవేందర్‌రెడ్డి హయాంలో రూ.2 కోట్ల పైచిలుకు నిధులు విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఇంతకాలం నిశ్శబ్దంగా ఉన్న సహకార శాఖ ఎట్టకేలకు దీనిపై విచారణను వేగవంతం చేశారు. సొసైటీ కార్యాలయంలో కో-ఆపరేటివ్ శాఖ జిల్లా అధికారి అంజియా డైరెక్టర్లతో వేర్వేరుగా మాట్లాడి వివరాలను సేకరించారు. నాలుగు రోజుల పాటు దీనిపై విచారణ కొనసాగనున్నట్లు తెలిసింది. గత పాలకవర్గం, కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించి మరిన్ని వివరాలు సేకరించనున్నట్లు సమాచారం. అన్ని కోణాల్లో విచారణ జరిపి నిధుల అవకతవకలపై నిగ్గు తేల్చనున్నారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని గిరిజన గురుకుల కళాశాల వసతి గృహంలో విద్యార్థులతో టిఫిన్స్ చేయించడమే కాకుండా ఇతర పనులు చేయించడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు హాస్టల్ సిబ్బందిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తిని ఆమె ఆదేశించారు.

భళా బాలక



కిలిమంజారో పర్వతంపై విహన్‌రామ్

కిలిమంజారో, పాతాల్సు పర్వతాలను అధిరోహించిన హనుమతండావాసి

బాలుడికి వాచ్ గిఫ్ట్ ఇచ్చి అభినందించిన గవర్నర్

ధూళిమిట్ట, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులోనే అత్యంత కష్టమైన పర్వతారోహణ చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు ధూళిమిట్ట మండలం హనుమతండాకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు విహన్‌రామ్. ప్రస్తుతం విహన్‌రామ్ మంచిర్యాల జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో ఉన్న 5,685 మీటర్ల ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం మనాలిలోని 4,250 మీటర్ల ఎత్తైన పాతాల్సు పర్వతాన్ని అధిరోహించి తెలంగాణ రాష్ట్రంలోనే అతి చిన్న వయస్సులో తక్కువ సమయంలో పర్వతరోహణ చేసిన బాలుడిగా రికార్డును విహన్‌రామ్ సొంతం చేసుకున్నాడు. పర్వతరోహణకు బాలుడి గురువు మహిపాల్‌రెడ్డి, తండ్రి తిరుపతినాయక్‌ను తీసుకువెళ్తుంటాడు. విహన్‌రామ్ గురించి తెలుసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బాలుడిని గత నెల 28న గవర్నర్ కార్యాలయానికి పిలిపించుకొని అభినందించి వాచ్‌ను బహుకరించారు.

ఏడు ఖండాలలోని పర్వతాలను అధిరోహించడమే లక్ష్యం

కోచ్ మార్గదర్శకత్వంలో, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో ఏడు ఖండాలలో ఉన్న పర్వతాలను అధిరోహించాలని ఉంది. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును అందుకోవడమే నా లక్ష్యం. అంతర్జాతీయ శిఖరాలపై భారతదేశ ఖ్యాతిని ఎగురవేయడమే నా ఆకాంక్ష.

\- విహన్‌రామ్

ప్రభుత్వం సహకారం అందించాలి

నేను ఆబ్కారీశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాను. పేదరికాన్ని చవిచూసి వచ్చిన నాకు.. నా కుమారుడు అంతర్జాతీయంగా పర్వతారోహణ చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వాలు సహకారం అందిస్తే ఇంకా ఎక్కువ రికార్డులను సాధించే అవకాశం ఉంది. త్వరలో ఆస్ట్రేలియాలోని మౌంట్ కోసియాస్కో పర్వతారోహణకు వెళ్లనున్నాడు.సహకరిస్తున్న హర్యానా క్యాడర్ ఐఎఫ్ఎస్ గుగులోత్ రామాన్‌కు, మంచిర్యాలకు చెందిన డాక్టర్ విద్యకు ధన్యవాదాలు.

\- తిరుపతి నాయక్, విహన్‌రామ్ తండ్రి

కళావిహీనంగా తయారైన ఆ సర్కారు పాఠశాలలు దాతల సహకారంతో సరికొత్త కళను సంతరించుకున్నాయి. పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న ముస్త్యాల పాఠశాల భవనానికి ఓ ఎన్‌ఆర్‌ఐ మరమ్మతులు చేయించి.. రంగులు వేయించి మౌలిక వసతులను సమకూర్చారు... నిర్వహణ సరిగ్గా లేక పాడుబడిన నంగునూరు ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయుడి కృషితో రూపురేఖలను మర్చారు.



ఎన్‌ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి ఇటీవల రంగులు వేయించిన ముస్త్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పాఠశాలలకు సరికొత్త రూపు

ఎన్‌ఆర్‌ఐ చొరవతో సుందరీకరణకు నోచుకున్న ముస్త్యాల బడి

కోతుల బెడద నివారణకు ఇనుప గ్రిల్స్ బిగింపు

విద్యార్థుల సంక్షేమం కోసం రూ.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్

హెచ్‌ఎం కృషి.. దాతల సహకారంతో నంగునూరు పాఠశాలకు మెరుగులు

చేర్యాల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు పెడుతల ప్రతాప్‌రెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి పాటుపడుతూ విద్యాభిమానాన్ని చాటుకుంటున్నాడు. తన సొంత ఖర్చుతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటూ కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. తద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి.

గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1-5వ తరగతి వరకు 110మంది విద్యార్థులు ఉన్నారు. చాలాయేళ్ల క్రితం నాలుగు గదులతో కూడిన భవనం నిర్మించినా శిథిలావస్థకు చేరుకుని పలుచోట్ల పెచ్చులూడిపోతున్నాయి. ఉన్న నాలుగు గదులు సరిపడకపోవడంతో వరండాలో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కోతులు స్వైరవిహారం చేస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులకు ఆట, పోటీల నిర్వహణ, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులుపడుతున్నారు. ఆయా అంశాల పరిగణనదృష్ట్యా పాఠశాల అవసరాల నిమిత్తం శాశ్వత ఆదాయ వనరుల కల్పనపై దృష్టి సారించాడు ఎన్‌ఆర్‌ఐ పెడుతల ప్రతాప్‌రెడ్డి. కొన్నాళ్ల క్రితం రూ.5లక్షలు నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ప్రతీనెలా సమకూరే వడ్డీ డబ్బుతో విద్యార్థులకు ఉపయోగకర పనులు చేస్తున్నారు. పాఠశాల భవనం ఇటీవల పెచ్చులూడిపోవడంతో రూ.1.50లక్షల వ్యయంతో మరమ్మతులు నిర్వహించి రంగులు వేయించారు. కోతుల బెడద నివారణతో పాటు తరగతి గదుల కొరత నివారణకు వరండా ప్రదేశంలో రూ.50వేల వ్యయంతో ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయించారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రార్థన, తదితర కార్యక్రమాల నిర్వహణకు సౌండ్ సిస్టమ్ ఇచ్చారు. పాఠశాల అవసరాల నిమిత్తం లేజర్‌జెట్ ప్రింటర్‌ను సమకూర్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నల్లాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పాఠశాల రూపురేఖలు మారిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయన సేవలను కొనియాడుతున్నారు.



ప్రింటర్‌ను అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

విద్యతోనే వివేకం

విద్యతతోనే వివేకం, జ్ఞానం కలుగుతుంది. మా గ్రామంలోని విద్యార్థులు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యపొందాలన్న లక్ష్యంతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాను. క్రమశిక్షణ అలవర్చుకుని చదువుకుంటూ ఉన్నత స్థానానికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని నావంతు చిరు ప్రయత్నం చేస్తున్నా.

\- పెడుతల ప్రతాప్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

ప్రభుత్వ నిధులు కోసం చూడకుండా



ప్రధానోపాధ్యాయుడు జయపాల్‌యాదవ్

నంగునూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులు కోసం ఎదురు చూడకుండా దాతల సహకారంతో పాఠశాల రూపురేఖలే మార్చారో ప్రధానోపాధ్యాయుడు. నంగునూరులోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పయ్యావుల జయపాల్‌యాదవ్ కృషితో ఆ బడి సరికొత్త రూపును సంతరించుకున్నది. 8 నెలల కిందట ఈ పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న జయపాల్‌యాదవ్ ఉన్న వనరులను ఉపయోగించుకుని దాతల సహకారంతో ఆరు నెలల్లోనే పాఠశాల రూపురేఖలే మార్చారు.

వర్షం కురిసినప్పుడు పాఠశాలలో అడుగు మేర నిలిచే నీరుతో తరగతి గదుల్లోకి వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ముందుగా పాఠశాల ఆవరణలో నీళ్లు నిలవకుండా చేసేందుకు స్వయంగా పలుగు, పార చేత పట్టి శ్రమదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణ చదును చేశారు. పచ్చదనం పరిశుభ్రత పేరిట పాఠశాల ఆవరణను పూర్తిగా శుభ్రం చేశారు. తరగతి గదుల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగింపజేశారు. నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయిన వంటగది ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను జయపాల్‌యాదవ్ స్వయంగా తొలగించారు. గతంలో ఈ స్థలంలో గొర్రెలను తోలేవారు. వారితో మాట్లాడి ఇక్కడకు గొర్రెలను తీసుకురాకుండా చర్యలు తీసుకున్నారు. గోడలకు రంగులు వేయించడంతోపాటు వాటిపై అందమైన బొమ్మలు గీయించి, సూక్తులు రాయించారు. పాఠశాలకు ఆవరణకు ప్రహరీ లేకపోవడంతో నర్సరీ నుంచి తన ద్విచక్రవాహనంపై మొక్కలను తెచ్చి నాటించారు. మొక్కలకు రక్షణగా, ఆవరణకు ప్రహరీలా ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. అర్ధాంతరంగా ఆగిపోయిన వంటగదిని మిత్రుడి సహాయంతో అమెరికాలోని బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధిని పూర్తిచేయించారు. పాఠశాలకు టీవీ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వారి ద్వారా సమకూర్చారు. సతీశ్ అనే దాత సహకారంతో పాఠశాల ప్రధాన గేటు నిర్మింపజేశారు. నంగునూరుకు చెందిన శనిగరం కనకయ్య అందించిన ఆర్థిక సాయంతో మధ్యాహ్న భోజన ప్లేట్లు అందించారు. పాఠశాలలో దేశ నాయకుల చిత్రపటాలను దాతలు అందించిన ఆర్థిక సహాయంతో పెట్టించారు. బడిని గుడిలా చూడాలి అనే సిద్ధాంతంతో ప్రధానోపాధ్యాయుడు పయ్యావుల జయపాల్‌యాదవ్ నంగునూరు పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.



నంగునూరు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల

గురక ట్రీట్మెంట్‌కు వెళ్తే.. ప్రాణాలు పోయాయి!

సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన

ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ఆస్పత్రి డాక్టర్, యాజమాన్యంపై బాధితుల దాడి



శ్రీనివాస్(ఫైల్)



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గురక సమస్యతో ఆస్పత్రిలో చేరిన వ్యక్తికి ముక్కులో శస్త్ర చికిత్స చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే గుండెపోటు రావడంతో మృతిచెందాడు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే చనిపోయాడంటూ కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించిన ఘటన గురువారం సంగారెడ్డిలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వి.శ్రీనివాస్(42)కు నిద్రలో తరచూ గురక వస్తుండడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం చేరారు. ముక్కులో ఎముక పెరిగిందని, ఆపరేషన్ చేయాలని కానీ మోడరేట్ రిస్క్ ఉంటుందని డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత పేషెంట్‌ను ఐసీయూకు తరలించారు. బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు పేషెంట్ శ్రీనివాస్‌కు ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో చనిపోయాడు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై శ్రీనివాస్ కుటుంబసభ్యులు, బంధువులు బైఠాయించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్ పోలీసులతో ఆస్పత్రి వద్దకు చేరుకుని మాట్లాడి పరిస్థితిని అదుపు చేశారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే శ్రీనివాస్ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. స్పందించిన ఆస్పత్రి యాజమాన్యం మానవతా దృక్పథంతో ఆర్థిక సాయంగా రూ.3 లక్షలు, కట్టిన ఆస్పత్రి బిల్లు రూ.60 వేలు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి శ్రీనివాస్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు శ్రీనివాస్ అన్న నాగేందర్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆస్పత్రి వైద్యుడు, యాజమాన్యంపై దాడి

అంతా సద్దుమణిగిందని అందరూ ఊపిరిపీల్చుకున్న తరుణంలో ఇంతలోనే పేషెంట్ శ్రీనివాస్ కుటుంబసభ్యులు కొందరు ఒక్కసారిగా ఆస్పత్రిలోనికి చొచ్చుకొచ్చారు. సర్జరీ చేసిన ఈఎన్‌టీ వైద్యులు శ్యామ్‌మనోహర్‌తో పాటు ఆస్పత్రి నిర్వాహకుడు రాజుపై దాడి చేశారు. దాడిని నిలువరిస్తున్న క్రమంలో సివిల్‌లో ఉన్న కానిస్టేబుల్ షర్ట్ కూడా చినిగిపోయింది. పట్టణ సీఐ రమేశ్ ఆస్పత్రికి చేరుకొని పలువురిని లాఠీతో చెదరగొట్టారు. తాము ఏం చేశామని కొడుతున్నారని పోలీసులపై పలువురు వాగ్వాదానికి దిగారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్ మరోమారు అక్కడికి చేరుకుని పరిస్థితిని ఆరా తీశారు.





హైవేపై కూలిన ఎలక్ట్రిక్ హోర్డింగ్

ఇద్దరికి గాయాలు

కామారెడ్డిలో జరిగే మిత్రుడి వివాహానికి కారులో వెళుతూ తూప్రాన్ పట్టణ పరిధి ఇమాంపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆగి రూట్‌మ్యాప్ చెక్ చేసుకుంటున్నాడు. ఆ సమయంలో హైదరాబాద్ వైపు నుంచి బోధన్‌కు వెళ్తున్న డీసీఎం కారును ఢీకొని పక్కనే ఉన్న ఎలక్ట్రిక్ హోర్డింగ్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎలక్ట్రిక్ హోర్డింగ్ కూలిపోయి కారుపై పడటంతో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన గడిపూడి ప్రత్యూష(25)గాయపడింది. డీసీఎం డ్రైవర్ మహ్మద్ అలీం సైతం గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

తూప్రాన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

అనుమానంతో భార్యను గొడ్డలితో నరికిన భర్త



లక్ష్మి(ఫైల్)

నారాయణఖేడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భార్యను భర్తే గొడ్డలితో నరికి హతమార్చిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తుర్కవడగాంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలం తుర్కవడగాంకు చెందిన హెబాలే గుండప్ప(55), లక్ష్మి అలియాస్ చంద్రమ్మ భార్యభర్తలు. 30 ఏళ్లుగా కాపురం చేస్తుండగా, వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. పెద్ద కూతురు వివాహం కాగా, మిగతా ముగ్గురు చదువుకుంటున్నారు. ఇంటి వద్ద గుండప్ప, అయన భార్య లక్ష్మి ఉంటారు. కొన్ని రోజులుగా గుండప్ప భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవపడేవాడు. ఇటీవల గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి, ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగొచ్చిన గుండప్ప లక్ష్మితో గొడవపడ్డారు. తెల్లవారుజామున గుండప్ప ఆమెపై గొడ్డలితో దాడిచేయడంతో తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె బయటకు పరిగెత్తుతున్న క్రమంలో ఇంటి ముంగిట్లో పడిపోయి చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో చుట్టుపక్కల వారు గుండప్పను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కంగ్టి ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిద్దిపేటలో యువకుడి హత్య



శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : యువకుడు హత్యకు గురైన సంఘటన సిద్దిపేటలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. తొగుట మండలం పెద్దమాసంపల్లి గ్రామానికి చెందిన బోదాసు శ్రీనివాస్(35) కరీంనగర్, హైదరాబాద్‌లలో కూలి పని చేస్తూ జీవిస్తుంటాడు. శ్రీనివాస్ తల్లికి సిద్దిపేట కేసీఆర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూం రావడంతో అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి వెళుతూ ఉంటాడు. ఈ క్రమంలో సిద్దిపేట నర్సాపూర్ రోడ్డులోని మైసమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటిలో గురువారం ఉదయం శ్రీనివాస్ మృతిచెంది కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే టూటౌన్ పోలీసులు చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్స్ సహాయంతో ఆధారాలను సేకరించారు. శ్రీనివాస్‌ను తలపై సెంట్రింగ్ కట్టెతో బలంగా కొట్టి చంపి ఉంటారని ప్రాథమిక విచారణలో తేలినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. శ్రీనివాస్ బుధవారం రాత్రి ఒక వ్యక్తితో మద్యం సేవించి ఘర్షణ పడినట్లు తెలిసిందని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌ను గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. వెంట ఎమ్మార్వో సుజాత, ఎంఈవో సత్తయ్య ఉన్నారు.

బోరుబావిని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గారం గ్రామంలో మాజీ సర్పంచు పుష్ప బాగులు బోరుబావిని గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. బోరుబావిలో గుర్తు తెలియని దుండగులు రాళ్లు వేసి ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళా సంక్షేమానికి కృషి

చేర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమంకోసం ప్రభుత్వం పాటుపడుతుందని చేర్యాల మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి పేర్కొన్నారు. మండలంలోని కడవేరుగు గ్రామంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం మహిళా కాంగ్రెస్ గ్రామకమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా ఇప్పల రజిత, ఉపాధ్యక్షురాలిగా పిట్టల కనకవ్వ,కార్యదర్శిగా కొమ్ముల బామణి, బూత్ అధ్యక్షురాలిగా పాముకుంట వసంత, సభ్యులను ఎంపిక చేశారు.

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమే బీజేపీ లక్ష్యం

గజ్వేల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు సమప్రాధాన్యమే బీజేపీ లక్ష్యమని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ నలగామ శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా బైరి శంకర్ ముదిరాజ్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రూ.లక్షలు ఖర్చు చేశారు.. లక్షణంగా వదిలేశారు





బీజీవెంకటాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఫంక్షన్‌హాల్, టైల్స్ మధ్యన పెరుగుతున్న పిచ్చిమొక్కలు

- బీజీ వెంకటాపూర్‌లో రూ.75లక్షలతో ఫంక్షన్‌హాల్
- గత ప్రభుత్వంలో ప్రారంభించినప్పటికీ దాదాపు రెండేళ్లుగా వినియోగానికి దూరం
- శుభకార్యాల కోసం ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను ఆశ్రయిస్తున్న ప్రజలు
- పిచ్చి గడ్డి పెరిగి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రూ. లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఫంక్షన్‌హాళ్లుపడావుగా మారుతున్నాయి. వినియోగంలో లేకపోవడంతో బీటలు బారుతున్న గోడలు, చెక్కు చెదురుతున్న బండలతో దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి మండలంలోని బీజీ వెంకటాపూర్‌లో నిర్మించిన ఫంక్షన్ హాల్ నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది.

ఎనిమిదేళ్ల క్రితం నిధులు మంజూరు

పేదలకు ఫంక్షన్‌హాల్ సేవలు అందించాలన్న లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో ఫంక్షన్‌హాల్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. జగదేవ్‌పూర్ మండలంలో బీజీ వెంకటాపూర్ గ్రామంలో గత ఎనిమిదేళ్ల క్రితం ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి రూ. 75 లక్షల నిధులను మంజూరు చేయగా సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తిచేశారు. పనులు పూర్తి అయినప్పటికీ రెండు మూడేళ్లు నిరుపయోగంగా పడి ఉంది. సాధారణ ఎన్నికలకు ముందు చిన్న చిన్న పనులు పూర్తి చేసి ప్రారంభించారు. కానీ నేటికి వినియోగంలోకి రాలేకపోతుంది. దీంతో ప్రస్తుతం ఫంక్షన్‌హాల్ పూర్తిగా నిరుపయోగంగా మారింది. దుమ్ము, ధూళితో దర్శనం ఇస్తుంది. వరండాలో బండలు లేచిపోయి, పగుళ్లు వచ్చి పిచ్చి మొక్కలు పెరిగాయి. విద్యుత్ బోర్డులు, కరెంట్‌వైర్లు మాయమయ్యాయి. నల్లాలు వృథాగా పడి ఉన్నాయి. మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిగడ్డి మొలిచి అధ్వానంగా తయారైంది. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఫంక్షన్‌హాల్ పూర్తిగా నిరుపయోగంగా పడి ఉండడం వల్ల వారు శుభకార్యాలు చేసేందుకు ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయించి అప్పులపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఫంక్షన్‌హాల్‌ను వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బాత్‌రూమ్‌ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

నిర్భయంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు



తొగుట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గరిమా అగర్వాల్

తొగుట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్ సూచించారు. గురువారం ఆమె మండలంలోని రాంపూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి తరగతి గదిలో పాఠాలను విని ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు, పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సమయములో ఏ విధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. భయం లేకుండా పరీక్షలు రాసి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, స్టడీ రూమ్, టాయిలెట్స్, తరగతి గదులను తాగునీటి వసతి, భోజనశాల, విద్యార్థినుల పడకగదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

అక్కడి నుంచి తొగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారని వైద్యుడు రాధాకిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అందించే చికిత్స, రిజిష్టర్లలో వివరాల నమోదు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో నర్సయ్యతో పాటు అధికారులు పాల్గొన్నారు.

‘కమల’దళంలో కలకలం

(5వ పేజీ తరువాయి..)

ముఖ్యంగా ఏబీవీపీ, బీజేవైఎం, ఆర్‌ఎస్‌ఎస్ విభాగాల ప్రతినిధులు ఈ విషయంలో తమ ప్రతికూలతను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ తరపున ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన అంజిరెడ్డి పోటీలో ఉండగా.. టీచర్ల అభ్యర్థిగా మల్క కొమురయ్య బరిలో ఉన్నారు. మరో వారం రోజుల్లోనే ఎన్నికలు ఉన్నాయి. గ్రాడ్యుయేట్లు, టీచర్లను తమవైపునకు తిప్పుకోవడంలో బీజేపీ శ్రేణులు కొద్దిరోజులుగా శ్రమిస్తున్నారు. ఈ సమయంలోనే జిల్లా అధ్యక్షుడి ఎన్నిక విషయం పార్టీలో వివాదాస్పదంగా మారిందనే అభిప్రాయాలు నెలకొన్నాయి. ఇప్పటిదాకా ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర ఎన్నికల్లో కష్టపడినా తనలాంటి వారికి పార్టీ పరంగా గుర్తింపు దక్కలేదని, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరి కోసం పనిచేయాలని బీజేపీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు ‘ఆంధ్రజ్యోతి’తో వాపోయారు. కాగా అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించిన క్రమంలో అసంతృప్తులపై దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం రాష్ట్ర పార్టీ నేతలకు ఉందని మరో వర్గం భావిస్తోంది.

అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సుకు మదన్‌మోహన్



సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సూక్ష్మజీవ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి మదన్ మోహన్ పరిశోధనా పత్రం నేపాల్ అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సుకు ఎంపికైంది. నేపాల్‌లోని ఖాట్మండులో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే 3వ అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సులో తన పరిశోధనా పత్రం ప్రవేశపెడుతున్నట్లు డాక్టర్ మదన్ మోహన్ తెలిపారు. మేడారం జాతర సమయంలో జంపన్న వాగు నీటి కాలుష్యంపై సామూహిక పుణ్యస్నానాల ప్రభావం అంశంపై చేసిన పరిశోధనా పత్రం ఈ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్ మోహన్ ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ కె రాణి డాక్టర్ శైలజ డాక్టర్ జి శ్రీనివాస్, ఏ కృష్ణయ్య, కే శ్రీదేవి, కీర్తన, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వంద ఎకరాల్లో హార్టికల్చర్ ధ్యేయం



అల్లిరాజుపేటలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవోపీడీ

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి జిల్లాలో వంద ఎకరాల్లో హార్టికల్చర్ సాగును విస్తరించే విధంగా ముందుకు సాగుతున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అలిరాజపేట్‌లో ఉపాధిహామీ పనులను పర్యవేక్షించి కూలీలకు తగు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశానికి హాజరై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో పలు అంశాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లాలో పండ్ల తోటలు, పశువుల పాకలు, గ్రామాల్లో పంట పొలాలకు రోడ్ల నిర్మాణం, గుట్టల చుట్టూ ట్రెంచులు కందకాలు, నర్సరీల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణలో భాగంగా షెడ్‌నెట్ జీవామృతం, వాటర్ ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల వద్ద కూలీలకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్, నీరు, నీడ అందుబాటులో ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతీ గ్రామపంచాయతీలో 25 మంది లేబర్‌కు తగ్గకుండా పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో కాజా మొహినొద్దీన్, ఏపీవో శైలజ, ఈసీ సుధాకర్ ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



కొండాపూర్‌లో మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సరిత

సిద్దిపేట, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):యువత మత్తుకు బానిసై జీవితాలను చిత్తుచేసుకోవద్దని మిరుదొడ్డి ఎక్సైజ్ ఎస్‌ఐ సరితా పేర్కొన్నారు. గురువారం మిరుదొడ్డి మండలంలోని కొండాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎక్సైజ్ సీఐ గాయంత్రి ఆదేశాల మేరకు విద్యార్థులకు గంజాయి, గుడుంబా, మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణాగౌడ్, షాబోద్దిన్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొండపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని త్రీ టౌన్ ఎస్‌ఐ మల్లేశం, సిద్దిపేట షీటీమ్ ఏఎస్‌ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత సూచించారు. కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లక్ష్మినారాయణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రం ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

‘రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్న కాంగ్రెస్’

గజ్వేల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల దివాలా తీయిస్తుందని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దివాలా అంచుకు వెళ్తున్నదని, వ్యాపారాలు దెబ్బతిన్నాయని, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, వాణిజ్య సముదాయాలు మూతబడుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు, సీఎంకు మధ్యలో సమన్వయం కొరవడిందని, అలాగే ముఖ్యమంత్రికి అధికారుల మధ్య సమన్వయం లోపించిందని, దీంతో పాలన కుంటుపడుతున్నదని దుయ్యబట్టారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లలో ప్రాంతీయ పార్టీలు గెలుపొందడంతో అక్కడి ప్రాంతాలు అభివృద్ధి బాట పట్టాయని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలుపుతోనే రాష్ట్రం గాడిలో పడుతుందని, ప్రజలు సైతం కాంగ్రెస్ పాలన పట్ల విసుగు చెందారని, త్వరలోనే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



గజ్వేల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పేర్కొన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించామన్నారు. కమిషనర్ నరసయ్యతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న:మునిసిపాలిటీ పరిధిలో వేసవి దృష్ట్యా నీటి సమస్యల నివారణకు చేపట్టిన చర్యలేంటి?

● మునిసిపాలిటీ పరిధిలో ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు లేనప్పటికీ సరిపడా నీరు రావడం లేదు. ప్రతి రోజూ మునిసిపాలిటీకి 7.5 ఎంఎల్‌డీ తాగునీరు రావాల్సి ఉండగా, ప్రస్తుతం 5ఎంఎల్‌డీ నీరు వస్తుంది. ఈ నీటిని రోజుకు రెండుసార్లు ఇస్తున్నాం. వేసవి దృష్ట్యా 41 పాత బోర్లను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చాం.

ప్రశ్న: పన్నుల వసూళ్లలో ఏ స్థానంలో ఉంది?

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం రాష్ట్రంలో 26 స్థానంలో ఉన్నాం. 15బృందాలతో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో 35మందిని పన్ను వసూళ్లకు వినియోగిస్తున్నాం. మూడు నెలలుగా సర్వేల కారణంగా పన్ను వసూళ్లు నెమ్మదించాయి. మునిసిపాలిటీ పరిధిలో గత సంవత్సరం రూ.3.96 కోట్లు వసూలు చేశాం. ఈసారి రూ.4.75లక్షల డిమాండ్ ఉండగా, ప్రస్తుతానికి రూ.2.86కోట్లు వసూలు చేశాం. పన్నుల వసూళ్లలో ప్రథమ వరుసలో మునిసిపాలిటీని నిలుపుతాం.

ప్రశ్న: పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ప్రత్యేక చర్యలు చేపట్టారా?

● మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలను చేపట్టాం. తడి, పొడి చెత్తపై ప్రజలకు రెండు నెలలు అవగాహన కల్పించాం. మంగళవారం, శుక్రవారం పొడి చెత్త, మిగిలిన రోజుల్లో తడి చెత్త తీసుకుంటున్నాం. మునిసిపాలిటీ పరిధిలో 11 మెట్రిక్ టన్నుల చెత్త ప్రతి రోజూ వస్తుంది. జీరో వేస్ట్ మేనేజ్మెంట్‌ను చేపడుతున్నాం. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చి ఆదాయాన్ని సృష్టించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: యూజీడీ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో 8,600 ఇళ్లకు యూజీడీ కనెక్షన్లు అందించాం. ప్రస్తుతానికి జెట్టింగ్ మిషన్ లేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ప్రజలు యూజీడీలో ప్లాస్టిక్ వ్యర్థాలు, డైపర్లు వేయొద్దు.

ప్రశ్న: ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి సకాలంలో ప్రజలు పన్నులను చెల్లించాలి. అంతేకాకుండా వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్‌లైసెన్సు తీసుకోవాలి. మునిసిపాలిటీ పరిధిలో ఏ సమస్య ఉన్నా వెంటనే ఫిర్యాదు చేస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 8 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం వారికి రూ.12,500 జరిమానా విధించారు.

ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

చేర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో పేకాడుతున్న పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో బొడిగం బాల్‌రెడ్డి వ్యవసాయబావి వద్ద పేకాడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. దాడుల్లో అదే గ్రామానికి చెందిన ఆరుగురు పేకాడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.2,107, 5మొబైల్ ఫోన్లు, 6 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

బయ్యారంలో వివాహిత అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని బయ్యారంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్ల కృష్ణవేణి(25) బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. గురువారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అటానమీ వ్యవస్థపై వర్క్‌షాప్



గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న గోపాల సుదర్శనం

గజ్వేల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటానమీ వ్యవస్థ అమలు విధానంపై గురువారం ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ గోపాల సుదర్శనం హాజరై ప్రసంగించారు. కళాశాల స్వయం ప్రతిపత్తి వ్యవస్థ విధివిధానాలు, కార్యాచరణ, కొత్త కోర్సుల రూపకల్పన, సిలబస్ రూపకల్పన, ఎగ్జామినేషన్ విధానం విధివిధానాలను గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్, అధ్యాపకులు తదితరులున్నారు.

ఎల్ఐసీ బ్రాంచ్ ఆఫీస్ వద్ద ఎంప్లాయిస్ ధర్నా



హుస్నాబాద్ ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలనే డిమాండ్‌తో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం హుస్నాబాద్‌లోని ఎల్ఐసీ బ్రాంచ్ ఆఫీసు ఎదుట ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. ఎల్ఐసీ సంస్థకు ఎక్కువగా ఆర్థిక భారం పడని బెస్ క్యాడర్స్ ఎల్ఐసీ అసిస్టెంట్స్, సబ్‌స్టాఫ్ ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి సదాశివరెడ్డి, కార్యదర్శి రాజేష్‌కుమార్, కరుణాకర్, వెంకటరాజం, అశోక్‌కుమార్, కిషన్ పాల్గొన్నారు. కార్మిక సంఘాల నాయకులు అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి వారికి మద్దతు పలికారు.

అవకతవకలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- రైతు ఐక్యతా సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ సీసీఐ పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడిన అధికారులతో పాటు బినామీ రైతులపై చర్యలు తీసుకోవాలని రైతు ఐక్యతా సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై గురువారం ఆయన హుస్నాబాద్‌లో వ్యవసాయశాఖ ఏడీఏకు వినతిపత్రం సమర్పించారు. హుస్నాబాద్ మండల వ్యవసాయ అధికారి పత్తి పంట వేయకున్నా వేసినట్లుగా ఏఈవోల సంతకాలను ఫోర్జరీ చేసి బినామీ రైతుల పేరున సీసీఐకి పత్తి విక్రయించేలా సహకరించాడని ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ జరుపగా 18 మంది బినామీ రైతుల పేరిట సీసీఐ పత్తి కొనుగోలు చేసినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, వ్యాపారులతో పాటు పేర్లు ఉన్న బినామీ రైతులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి కోర్సులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విభాగం, వివిధ విద్యా నేపథ్యాలకు అనుగుణంగా రెండు సర్టిఫికేట్ కోర్సులను ప్రవేశపెట్టారు. కంప్యూటర్ ప్రధానాంశంగా బోధింపబడని విద్యార్థుల కోసం, అవసరమైన డిజిటల్ నైపుణ్యాన్ని అందించడానికి ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ అప్లికేషన్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఆధునిక వెబ్ టెక్నాలజీలలో వారి నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉద్దేశించిన ఫ్రంటెండ్ డెవలప్‌మెంట్ కోర్సు తీసుకొచ్చారు. ఈ కోర్సులలో చేరడం ద్వారా విద్యార్థులు ప్రయోజనం పొందవచ్చని ప్రిన్సిపాల్ సునీత అన్నారు. ఉచితంగా అందిస్తున్న ఈ రెండు కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం, విద్యార్థులు కళాశాల కంప్యూటర్ విభాగాధిపతిని సంప్రదించాలన్నారు.

పోస్టు మెట్రిక్ హాస్టల్ ఉద్యోగులకు జీవో వర్తింపజేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పని చేస్తున్న తమకు కంటిన్యూయేషన్ జీవో వర్తించే విధంగా చేసి తమ జీతాలను ఇప్పించాలని బాధితులు కోరారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్ జరిగిన సమావేశం వారు మాట్లాడారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో 49 మంది వర్కర్లు పనిచేయగా, 28 మందికి మాత్రమే కంటిన్యూయేషన్ జీవో ఇచ్చారన్నారు. మిగిలిన 21 మంది ఉద్యోగులకు కూడా కంటిన్యూయేషన్ జీవో వర్తించేలా సంబంధిత బీసీ వెల్ఫేర్ మినిస్టర్ సంబంధిత జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాల్సిందిగా రాష్ట్ర జేఏసీ, సిద్దిపేట జిల్లా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కృష్ణ, భిక్షపతి, లక్ష్మీ, కల్యాణి, యశోద, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ప్రవీణ్ కుమార్

బెజ్జంకి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర సురేష్‌కుమార్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గురువారం స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, లక్ష్మణ్, మోహన్, బాబు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మాజీ జడ్పీటీసీకి డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

దూళిమిట్ట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):మాతృ వియోగంతో బాధపడుతున్న ఉమ్మడి మద్దూర్ మండల మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డిని గురువారం జాలపల్లి గ్రామంలోని వారి స్వగృహంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు.